# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 25

**ఆ మర్నాడు ఉదయం** ఒకతను మసూమ్ని వెతుక్కుంటూ అతనింటికి వచ్చాడు. రాయచూరు కోట గుమ్మం వద్ద అతన్ని కలవడానికో పెద్దమనిషి వచ్చాడనీ, ఉన్నపళంగా రమ్మన మని చెప్పాడు. మసూంకి ఆశ్చర్యం వేసింది. సాధారణంగా తన ఇంటికెవరూ రారు. ఏ వ్యవహారమయినా తానంతట తానే వెళ్ళి కలుస్తాడు తప్ప ఏ వ్యవహారమూ ఇంటి వరకూ తీసుకు రాడు. బహుశా ఫిరోజ్‌షా తరపు మనిషి గుల్బర్గా నుండి వచ్చుంటాడని అనుకొని ఒక్కడే బయల్దేరాడు. ఆ వచ్చినతను కోట గుమ్మం వరకూ తోడొచ్చాడు. అక్కడ ఎవరూ కనిపించకపోయే సరికి అనుమానమొచ్చి మసూం అతన్ని ప్రశ్నించాడు. కొంతసేపట్లో వస్తారని కాస్త ఓపిక పట్టమని ఆ వ్యక్తి చెప్పాడు. కొంతసేపయ్యాక ఒక వ్యక్తి వచ్చాడు. అతని వెనుక మరో నలుగురొచ్చారు. ఆ వచ్చిన వ్యక్తి నల్లగా పొడుగ్గా ఉన్నాడు. గడ్డం అదీ మాసి వుంది.

వస్తూనే - "నువ్వేనా మసూం! నీతో పనిపడింది," అంటూ తానెవరో చెప్పకుండా సంభాషణ మొదలుపెట్టాడు.

"విజయనగర మహారాజు దేవరాయలు నీకో విషయం చెప్పమని పంపారు. దేవరాయల కుమార్తె మంజరిని గుల్బర్గా సుల్తాన్ ఫిరోజ్ షాకి ఇచ్చి పెళ్ళి చేసారు. ఆమె ప్రాణానికి ఎటువంటి హానీ జరక్కుండా ఉండాలన్నది మహారాజు అభిమతం. ఈ సందర్భంగా ఒక్కసారి మంజరిని రహస్యంగా కలవాలి. దానికి నువ్వు ఏర్పాటు చెయ్యాలి. ఇది మహారాజు ఆజ్ఞ" చెప్పాడతను.

ఒక్క క్షణం ఆలోచించాడు మసూం. తను దేవరాయల తరపున వేగు అన్న విషయం అతి తక్కువమందికే తెలుసు. అయినా ఏదయితేనేం, సరే నన్నాడు.

"రేపు గుల్బర్గా వెళదాం. నాకు తెలుసున్న వారి ద్వారా ప్రయత్నిస్తాను. నేనెప్పుడూ సుల్తానా మందిరాలని కూడా చూళ్ళేదు. అసలే వాళ్ళకి ఘోషా ఎక్కువ. అయినా ప్రయత్నిస్తాను. మీరు నాతో రావాల్సుంటుంది. రేపుదయం ఇక్కడికే రండి. అయినా తెలీకడుగుతాను, ఒక్క విషయం చెప్పండి," అంటూ ఆగిపోయాడు.

చెప్పమన్నట్లు ఆ వచ్చిన వ్యక్తి తల ఎగరేసాడు.

"వియ్యం పొందిన వారికి గుల్బర్గా సుల్తానులని కలవడానికి నేనెందుకు? మీరే వెళ్ళచ్చు కదా? రాచ మర్యాదలతో ఆహ్వానిస్తారు కూడా," అనుమానాన్ని పైకి చెప్పాడు.

ఆ వచ్చినతను ఏ సందర్భంలో దేవరాయలు తనకుమార్తెను ఫిరోజ్‌షాకిచ్చి పెళ్ళి చేసాడో వివరంగా చెప్పాడు.

"వెళ్ళచ్చు. కానీ, వెళ్ళే పరిస్థితి కాదు. ఇంతవరకూ కత్తులు దూసుకున్నా రాజ్యాలు ఒక్క క్షణంలో కావలించుకోలేరు. ఒకర్ని ఒకరు నమ్మే పరిస్థితి లేదు. అందుకనే ఈ వెనుక దారి ప్రయత్నాలు," చెప్పాడతను.

మసూం ఏదో అనబోతూండాగా మరలా అతనే అన్నాడు.

"రేపటి వరకూ సమయం లేదు. ఈ క్షణమే బయల్దేరి వెళ్ళాలి. నువ్వు చేసే సహాయానికి ఇదిగో నీ కానుక," అంటూ అతను చిన్న సంచీలో బంగారు నాణాలు ఇచ్చాడు.

ఇంటికెళ్ళి ఇప్పుడే తిరిగొస్తానని చెప్పి బయల్దేరాడు. ఇంటికొచ్చి తను హఠాత్తుగా గుల్బర్గా వెళ్ళే పనిపడిందనీ, నేహలనీ వాళ్ళనీ జాగ్రత్తగా చూసుకోమని రేవన్నకి చెప్పి బయల్దేరాడు.

ఉన్న పళాన ఏం పనిపడిందని రేవన్న అడిగాడు కానీ, మసూం పనేవిటో చెప్పకుండా దాటేసాడు. తనొచ్చేసరికి ఆలస్యం కావచ్చనీ కూడా చెప్పాడు.

కాస్త పొద్దెక్కాకా తనూ ముద్గల్ వెళ్ళొస్తానని శంభుడు మసూంకి చెప్పాడు.

మసూం వెళ్ళిన కొంతసేపటికి శంభుడూ బయల్దేరాడు. అతనికి సాయంగా కోట గుమ్మం వరకూ వెళ్ళొస్తానని రేవన్నా బయల్దేరాడు.

త్వరలోనే నేహలా, తనూ ముద్గల్ వస్తామనీ చెప్పాడు రేవన్న. కోట గుమ్మం సమీపిస్తూండగా కొంతమంది గుర్రాల మీద రావడం చూసి దూరంగానే ఆగిపోయారు శంభుడూ, రేవన్నా. వాళ్ళందర్నీ పరికించి చూసాడు. అక్కడే మసూ కూడా నిల్చొని కనిపించాడు. ఆ గుర్రం మీదొచ్చిన వ్యక్తి మసూం ముందు ఆగాడు. మసూం గుర్రం ఎక్కాడు. అతని వెనుకే మరో రెండు గుర్రాలు వెళ్ళాయి. ఆ మధ్యలో ఉన్న గుర్రమ్మీద వ్యక్తి చూసి శంభుడికి నోట మాట రాలేదు. అలా చూస్తూ ఉండి పోయాడు.

రేవన్నకిదంతా అయోమయంగా అనిపించింది. శంభుడు మెల్ల ఒక పక్కకొచ్చేసాడు. అతని కళ్ళల్లో భయం కనిపిస్తోంది.

"ఏవయ్యింది, శంభూ? ఏవిటా తత్తర్పాటు?" ప్రశ్నించాడు రేవన్న.

"మసూమ్‌ని తీసుకెళ్ళింది ఎవరనుకున్నావు? అతను...అతను..." మాట పెగల్లేదు శంభుడికి.

"అతనెవరు?" కంగారు పెట్టాడు రేవన్న.

మెల్లగా తేరుకొని చెప్పాడు శంభుడు.

"అతనే దేవరాయల బావమరిది నరేంద్ర గజపతి. ముద్గల్ పాలిట ద్రోహి. అతనే నేహల కోసం వచ్చాడు. మసూమ్ దగ్గరే ఉన్నామని అతనికి తెలిస్తే ప్రమాదం!"

"నువ్వేం భయపడనవసరం లేదు. గత మూణ్ణెల్లుగా ఇక్కడ క్షేమంగా ఉన్నాము. మమ్మల్ని కంటికిరెప్పలా చూసుకున్నాడు మసూం," అంటూ మసూం గురుంచి అమతా చెప్పాడు.

కొంత సేపయ్యాక శంభుడు శలవు తీసుకున్నాడు.

000000000000

చీకటి పడే వేళకి మసూం, నరేంద్ర గజపతీ గుల్బర్గా చేరుకున్నారు. సుల్తాన్ని సరాసరి వెళ్ళి కలవడమే మంచిదని మసూం దారిలో ఎంత చెప్పినా నరేంద్రగజపతి ఒప్పుకోలేదు. అతని ధ్యేయం మంజరిని రహస్యంగా కలవడమే! కలిసి ఏం చెయ్యాలన్నది అతనికి ప్రస్తుతం ఏమీ తెలీదు. మంజరిని అడ్డుపెట్టుకొని దేవరాయల మీద కక్షతీర్చుకోవాలన్న ఆవేశం ఒక్కటే ప్రస్తుతం అతనికి ఉంది. కానీ పైకి మాత్రం నిభాయించుకునే ఉన్నాడు. రాత్రి తనకు తెలుసున్న వాళ్ళింట్లో బస చేసారు.

పైకి తనకు తెలుసున్న వారి ద్వారా ప్రయత్నిస్తాని చెప్పాడు కానీ, సరాసరి అహ్మద్‌ఖానుకే చెప్పాలని నిర్ణయించుకున్నాడు మసూం. అందుకే ఒక్కడూ సుల్తాన్ కోట వైపుగా వెళ్ళాడు. తనొచ్చే వరకూ అక్కడే ఉండమని నరేంద్ర గజపతికి చెప్పాడు. ఇంత జరుగుతున్నా నరేంద్ర గజపతి తానొక సైనికాధికారనే చెప్పాడు కానీ, దేవరాయల బావమరిదిననీ, తానే ముద్గల్ దాడిని నడిపించిన వ్యక్తినీ పైకి చెప్పలేదు. నరేంద్ర గజపతి చెప్పింది మసూం నమ్మాడు.

మర్నాడు ఉదయం సుల్తాన్ మహల్ వద్దకు వెళ్ళి తనకి పరిచయమున్న అధికారులని సంప్రదించాడు మసూం. అహ్మద్‌ఖాన్ని సత్వరమే కలవాలని కబురంపాడు.

సరిగ్గా ఆ సమయానికి గిసుదరాజు, అహ్మద్‌ఖాన్ మిగతా సైనికాధికారులూ సమావేశమయ్యున్నారు. దేవరాయల గురించే వారు చర్చిస్తున్నారు.

"నేనేదో మంచితనానికి పోయి దేవరాయల్ని నమ్మాను. సంధి కుదిరితే ఇరు రాజ్యాలూ సఖ్యత ఉంటాయనీ ఆశించాను. ఏరు దాటాక తెప్ప తగలేసే రకమని ఊహించలేదు. ఇప్పటికీ నాకు అర్థం కాని విషయం ఏమిటంటే దేవరాయలు ముద్గల్ వైపుగా సైన్యాన్ని ఎందుకు మోహరించాడు? అసలీ అనుమానాలన్నింటికీ అదే ముఖ్య కారణం అనిపిస్తోంది," గిసుదరాజ్ అన్నాడు.

"మాకు అదే అర్థం కాలేదు మౌల్వీ వేగులు మాత్రం సరైన సమాచారమే ఇచ్చారు. కానీ ఏదో, ఎక్కడో తెగిపోయింది. మీరు చెప్పిన దాని బట్టి చూస్తే దేవరాయలు అసలు మనమీద దండెత్తే ఆలోచనే లేదు. అనవసరంగా మా అన్నగారు గాయపడ్డారు. కానీ దేవరాయల ప్రవర్తన చూస్తే అతను మనల్ని ఇహ వదిలి పెట్టడనే అనిపిస్తోంది," అహ్మద్‌ఖాన్ చెప్పాడు.

"చూద్దాం! రాయచూరు మన ఆధీనంలోకి అప్పుడెప్పుడానికి కలుస్తాం కదా? అప్పుడు అతనికి ఇచ్చిన మాట మీద ఎంత గౌరవం వుందో తెలుస్తుంది. మనం ప్రస్తుతం చెయ్యదగినదేదీ లేదు," అని తన అభిప్రాయం చెప్పాడు.

సరిగ్గా అదే సమయానికి మసూం వచ్చినట్లుగా కబురొచ్చింది. వెంటనే రమ్మనన్మని అహ్మద్‌ఖాన్ అతన్ని లోపలకి పిలిపించాడు.

లోపలికొచ్చాక మసూం అహ్మద్‌ఖానుకి జరిగిన దంతా చెప్పాడు. ఎవరో దేవరాయల సైనికాధికారి ఒకతను మంజరీ సుల్తానాని రహస్యంగా కలవడానికి వచ్చాడనీ, ఇదంతా అతనికి అనుమానంగా ఉందనీ చెప్పాడు. తక్షణమే వాళ్ళని బంధించి తీసుకు రమ్మనమని సైనికులని ఆదేశించాడు అహ్మద్‌ఖాన్. మసూం మాత్రం అక్కడే ఉండిపోయాడు. కొంతసేపయ్యాక నరేంద్ర గజపతినీ, అతని అనుచరులనీ బంధించి అహ్మద్‌ఖాన్ ముందు హాజరు పరిచారు. గిసుదరాజుకి ఏవా అర్థం కావడంలేదు.

ఆ బంధించిబడిన వ్యక్తుల్లో నరేంద్రగజపతిని చూడగానే గుర్తు పట్టాడు గిసుదరాజ్. అతన్ని దేవరాయల రాజమందిరంలో చూసినట్లుగా గుర్తొచ్చింది. అదే అహ్మద్‌ఖాన్‌తో అన్నాడు. అహ్మద్‌ఖాన్ అతని పేరూ అవి అడిగాడు.

నరేంద్ర గజపతి తన వివరాలన్నీ చెప్పాడు. అక్కడే ఉన్న ఒక దుబాసీ అతని మాటలు తర్జుమా చేసి చెప్పాడు. నరేంద్ర గజపతి పేరు వినగానే మసూంకి విషయం అర్థమయ్యింది. ముద్గల్ దాడి కారకుడితనేననీ, అతన్ని బంధించి అప్పుజెప్పడం తాను మంచి పనే చేసాడనీ లోలోపల ఆనందించాడు. అతను తనింటికే వచ్చుంటే ఎంతో గందరగోళం జరిగేదనీ, పెద్ద ప్రమాదం తప్పిందనీ సంతోషించాడు.

నరేంద్ర జగపతిని బంధించేసరికి అతను కాళ్ళ బేరానికొచ్చేసాడు. తను ఏ చెడు ఉద్దేశ్యంతో రాలేదనీ, మహారాణి కూతురి క్షేమం కనుక్కోమని పంపించిందనీ మాట మార్చాడు. తనని వదిలి పెట్టమనీ, కావాలంటే మంజరిని పిలిపించి అడగమనీ ప్రాధేయ పడ్డాడు.

ఇదే సరైన సమయమని తలచీ, గిసుదరాజు అసలెందుకు దేవరాయలు తమపై దండెత్తు దామనుకున్నాడో, ముద్గల్ వైపుగా సైన్యాన్ని ఎందుకు మోహరించాడో చెప్పమనీ నిర్బంధించాడు. నిజం చెబితే వదిలేస్తామనీ కూడా హామీ ఇచ్చాడు. నరేంద్ర గజపతి మెల్లగా చెప్పడం ప్రారంభించాడు.

వేదరాయశర్మ అపురూప సౌందర్యవతి నేహలని రాణిని చెయ్యాలని సంకల్పించి పంపిస్తే ఆమె పారిపోయిందనీ, ఆమెను బంధించి తీసుకు రమ్మనమనీ తనని పంపాడనీ, ముద్గల్ గ్రామ ప్రజలు తమపై దాడి చేస్తే దాన్ని సైనికులు అణచివేసారనీ చెప్పాడు తప్ప తాను పురమాయించిన విధ్వంసం గురించి చెప్పలేదు.

అతను చెప్పినదంతా విని అహ్మద్‌ఖాన్, గిసుదరాజ్ ఆశ్చర్యపోయారు.

"నువ్వు చెప్పేది నిజమేనా? ఒక అమ్మాయి రాణిని చేస్తానంటే వద్దని తిరస్కరించిందా? చాలా వింతగా ఉంది!"

"ఇది మాత్రం నిజం. మాపై జరిగిన తిరుగుబాటులో ఆ అమ్మాయి కుటుంబం ముద్గల్ నుండి పారిపోయిందనీ అందరూ అన్నారు. ఈ యుద్ధాలు అవీ జరగడానికి ఆ అమ్మాయే కారణం. అంతే తప్ప దేవరాయలకి మీపై దాడి చేసే ఉద్దేశ్యమే లేదు. నన్ను నమ్మండి," అంటూ ప్రాధేయపడ్డాడు.

అహ్మద్‌ఖాన్‌కి ఒక్కొక్క చిక్కుముడీ విడువడుతూ చూచాయగా ఏం జరిగిందో అర్థమయ్యింది.

"మరి ఆ అమ్మాయి ఏవయ్యిందీ?" గిసుదరాజు ప్రశ్నించాడు.

"తెలీదు. మీ రాజ్యంలోకే వచ్చి ఉండ వచ్చనీ దేవరాయలు భావించారు. మీరు మాపై యుద్ధానికి రావడానికి ఆ అమ్మాయే కారణమనీ అక్కడ విజయనగరంలో అనుకున్నారు," చెప్పాడు నరేంద్రగజపతి.

"మారాజ్యంలో ఉందా? మీ దేవరాయలే మాపి దండెత్తడానికొస్తున్నాడనీ మాకు కబురొచ్చింది," అంటూ అనుమానంగా మసూం వైపు చూసాడు.

ఒక్కసారి కంగారు పడ్డాడు మసూం. పైకి ఏమాత్రం బెదరకుండా చూస్తూ నిల్చున్నాడు.

కొంతసేపు అహ్మద్‌ఖాన్ గిసుదరాజ్ దగ్గరకొచ్చి ఏదో చెప్పాడు. ఆ తరువాత నరేంద్రగజపతినీ, అతని అనుచరులనీ బంధించి కారాగారంలో ఉంచమని ఆదేశించాడు.

నరేంద్రగజపతి ఎంత మొత్తుకున్నా వినలేదు. సైనికు వాళ్ళని అక్కడనుండి తీసుకెళిపోయారు. వెళుతూ, వెళుతూ నరేంద్ర గజపతి మసూమ్ని తూలనాడాడు. మోసం చేశాడాని తిట్టాడు.

అతను వెళ్ళాక, మసూమ్ని ఉండమని చెప్పాడు అహ్మద్‌ఖాన్.

"ఆనాడు నువ్వూ, మిగతా వేగులూ దేవరాయలు యుద్ధానికొస్తున్నాడని మమ్మల్ని తప్పుదారి పట్టించారు. అనవసరంగా ఇదంతా జరిగింది," అంటూ మండిపడ్డాడు అహ్మద్‌ఖాన్.

"అప్పట్లో మాకు తెలిసినదే చెప్పాము. ఇతను చెప్పేది మాకూ వివరం తెలీదు. ఇన్నాళ్ళూ మీకు ఎన్నో వార్తలు తెచ్చాను. ఎప్పుడైనా ఇలా జరిగిందా హుజూర్?" జాలిగా చూసాడు మసూం. సుల్తానులతో వ్యవహారం ఎలాంటిదో అతనికి తెలుసు.

"వేగులు వాళ్ళకి తెలుసున్నది చెబుతొఒరు. వాళ్ళని నిందిచి ప్రయోజనం లేదు. మనం కూడా తొందరపడకుండా ఉండాల్సింది. ఇందులో మన తొందరపాటూ ఉంది.

ఫిరోజ్‌కి చెప్పి ఆ కొత్తమ్మాయిని వివరం అడగమంటే తెలుస్తుంది. ఇప్పుడైనా మన కాస్త నిదానంగా వ్యవహరించాలి. ఇదంతా చూస్తూంటే ఒకటి మాత్రం నమ్మ బుద్ధి కావడం లేదు. ఒక అందమైన అమ్మాయిని పెళ్ళి చేసుకోవడానికి దేవరాయలు సైన్యాన్ని పంపాడా? ఆ అమ్మాయి ధైర్యానికి మెచ్చుకోవాలి!" గిసుదరాజు అన్నాడు.

"నాకూ అదే అనిపిస్తోంది. మహారాజు పెళ్ళాడుతానంతే ఎవరైనా ఎగిరి గంతేస్తారు. మరెందుకు ఆ అమ్మాయి...?" అంటూ అహ్మద్‌ఖాన్ మధ్యలో ఆపేసాడు.

"ఆ అమ్మాయి చాలా అందగత్తెనీ నేనూ విన్నాను హుజూర్! ముద్గల్లో అందరూ ఆ అమ్మాయి గురించే చెప్పేవారు," మసూం మెల్లగా అన్నాడు.

"అసలా అమ్మాయి గురించి దేవరాయలకెలా తెలిసింది?"

"వేదరాయశర్మా అనే ఒకాయన దేవరాయలకి సన్నిహితుడు. ఆయనదీ ముద్గల్ గ్రామమే! ఆయనే ఈ వివాహాన్ని ప్రతిపాదించాడు. కానీ చివరకి ఆయనే బలయిపోయాడు."

"ఏవయ్యింది? చంపేసారా?" ఎవరన్నట్లుగా అడిగాడు గిసుదరాజ్.

"ఈ నరేంద్రగజపతి ఆ అమ్మాయికోసం ముద్గల్లో విధ్వంసం చేసాడు. ఆ సమయంలో వేదరాయశర్మని ఎవరో చంపేసారు. అందుకని ఆ అమ్మాయి భయపడి పారిపోయింది," మెల్లగా అన్నాడు మసూం.

"అలాగా! ఆ అమ్మాయి మన రాజ్యంలోనే ఉందని అతనంటున్నాడు, ఎక్కడుందో?" నవ్వుతూ అన్నాడు అహ్మద్‌ఖాన్.

"ఆ అమ్మాయి మన రాజ్యంలోనే ఉంటే వాకబు చేయించు. నాకూ చూడాలని వుంది. ఆమె అందాన్ని చూడాలని కాదు. ఆమె ధైర్యాన్ని మెచ్చుకోవడానికి," గిసుదరాజ్ అన్నాడు.

"అలాగే! " అని మసూం వైపు తిరిగి, "ఆ అమ్మాయి ఎక్కడుందో కనుక్కో! మౌల్వీ చూడాలని ఆరాట పడుతున్నారు," నవ్వుతూ అన్నాడు.

ఒక్కసారి నిశ్చేడయ్యాడు మసూం. తన వద్దే నేహల ఉంటోందని తెలిస్తే తనకే ప్రమాదం. చెబితే నేహలకి ప్రమాదం. చెప్పకపోతే సుల్తాన్ తనని నమ్మరు. అలాగని నేహలని తక్షణమే తన వద్దనుండి ముద్గల్ వైపు పారిపోమంటే దేవరాయల సైన్యం వదిలిపెట్టదు.

ఒక్కసారి మెదడు స్థబ్ధుగా అయిపోయింది. తను చెప్పకపోయినా వేరెవరి ద్వారానయినా తెలియవచ్చు. సుల్తాన్ తలుచుకుంటే ఎంత సేపు? పరిపరి విధాల పోతున్నాయి ఆలోచనలు.. అతనికి నేహల క్షేమమే ముఖ్యం. ఆమె దేవరాయల రాజ్యంలో ఉండడం కంటే ఇక్కడే ఉండడం మంచిది. పైగా వీళ్ళందరూ ఒకసారి చూడాలనుకుంటున్నారు తప్ప దేవరాయల్లా వేరే ఉద్దేశ్యాలు లేవు కదా?

వెళ్ళబోతూ మెల్లగా అన్నాడు.

"ఆ అమ్మాయి ఎక్కడుందో నాకు తెలుసు సుల్తాన్!"

గిసుదరాజ్, అహ్మద్‌ఖాన్ ఒక్కసారి నమ్మలేనట్లు చూసారు.

000000000

ఆ మర్నాడు మసూం వెంట ఫిరోజ్‌షా సైనికులు కొంతమంది వెళ్ళారు.

ముందు మసూం ఒక్కడే ఇంట్లోకి వెళ్ళాడు. కొద్ది సేపయ్యాక పాతిక మంది సైనికులు ఆ ఇంటి వద్దకు రావడం చూసి రేవన్నా, నేహలా కంగారు పడ్డారు.

ఏం జరుగుతూందో గ్రహించేలోపల అందర్నీ బంధించడానికి సన్నిద్ధుయ్యారు. నేహల తల్లి తండ్రులు అడ్డుకోబోతే వారిని వెనక్కి నెట్టారు. రేవన్నకీ అదే జరిగింది.

మసూం వాళ్ళని ఎదుర్కోవద్దని చెప్పాడు. సైనికులనీ భయపెట్టద్దని వారించాడు. నోట మాట రాలేదు. హుతాశురాలయ్యింది నేహల.

"కంగారు పడద్దు. సుల్తాన్ ఫిరోజ్‌షా మిమ్మల్ని చూడాలని పంపించారు. వివరాలు అన్నీ చెబుతాను," అని వాళ్ళని అనుయాయించాడు.

జరిగినదంతా చెప్పాడు. ప్రస్తుత పరిస్థితుల్లో సైనికుల వెంట వెళ్ళడం తప్ప గత్యంతరం లేదనీ, కాదని ఎదుర్కుంటే ప్రాణాలకే ప్రమాదమనీ సర్ది చెప్పాడు.

"నన్ను నమ్మండి. మనం గుల్బర్గా వెళ్ళడమే ప్రస్తుత పరిస్తుతుల్లో క్షేమం. అయినా చూడాలని తీసుకు రమ్మనమని చెప్పింది మౌల్వీ గిస్సుద్రాజు. ఆయనవల్లే దేవరాయల కూతుర్తో ఫిరోజ్‌షా పెళ్ళి చేసుకున్నాడు. మీతో నేనూ ఉంటాను," అని ధైర్యం చెప్పాడు.

మెల్లగా నేహలే అంది.

"మసూం! రావడానికి అభ్యంతరం లేదు. కానీ సుల్తాన్ ఫిరోజ్‌షా ప్రస్తుతం దేవరాయలు అల్లుడు. వాళ్ళ బంధుత్వాలు నడ్డు పెట్టుకొని మనల్ని దేవరాయలకి అప్పజెప్పరని నమ్మకం ఏవిటి?"

"చెల్లీ, నన్ను నమ్ము. నీతో పాటూ నేనూ వుంటాను. మనం కాదని అంటే మనందరికీ ప్రమాదం. ఒక్కసారి వెళితే మనకి మంచే జరుగుతుందని నాకనిపిస్తోంది," అంటూ నచ్చజెప్పాడు.

విధిలేక అతన్ని అనుసరించింది నేహల. ఆమె వెంటే ఆమె తల్లీ, తండ్రీ, రేవన్నా!

00000000000000000000000*00000000000*

(కొనసాగింపు వచ్చేసంచికలో)

Click here to share your comments on this serial